కథా నిలయం
శ్రీకాకుళం

# శ్రీ రా మ ర క్ష

"న్యూ కాలనీ....న్యూ కాలనీ ఎవరండీ...." సిటీ బస్ "ఎగ్జిట్ డోర్" వద్ద అతుక్కుపోయినట్లు నిలబడివున్న పురుషుల గుంపును తోసుకుంటూ బస్సు దిగింది సుమిత్ర. జారిన పమిటనుగాని, చెరిగిన ముంగురులనుగాని సర్దుకొనే ప్రయత్నమన్నా చేయలేదు. దిగీ దిగగానే చేతి గడియారంలో టైము చూసింది.

చూస్తూండగా —

ఆఫీసు టయిమయ్యాక ఇంటికి బయలుదేరబోతుంటే ఏదో పనిని అంటగట్టి ఆపుచేసిన ఆఫీసర్ సైంధవుడు ఆమెకు డయల్‌పైన కన్పించాడు.

"వెధవ. ఒట్టి సేడిస్ట్...." అని మనసులో తిట్టుకుంది.

గడియారం డయల్ పైన ఆఫీసరుగాడి బొమ్మ అంతర్థానమయింది. ఆరు గంటలు దాటి.... పది.... అమ్మో....పదిహేను నిముషాలు.

బస్సు బయల్దేరిపోయింది. డిసెంబరు సాయంకాలం....చీకట్లు....

చీకట్లోకి బిక్కుబిక్కుమని చూస్తూ ఇంటి మెట్లపైన దీనమైన మొహంతో కూర్చున్న మూడేళ్ళ సురేష్ బొమ్మ ఆమె కనుల ముందు నిలిచింది.

సుమిత్ర ఎవరో తోసినట్లు వేగంగా అడుగులువేస్తూ నడవసాగింది. పరుగు నడక....నడక....పరుగు.

ఇదివరలో సుమిత్ర ఇంటికిరావటం ఇలాగే ఆలస్యమయితే రెండు సార్లు మెట్లమీదే కూర్చున్నాడు. పక్క ఇంటివాళ్ళు పిల్చినా వాళ్ళ ఇంటికి వెళ్ళడు. అంత అభిమానం వాడికి ! తన కది పనిష్‌మెంట్ !

ఆఫీసు కాగానే బయలుదేరే బస్సులో ఎక్కితే నేరుగా ఆ బస్సు న్యూ కాలనీ సెంటర్ దగ్గరికి అయిదున్నరకల్లా తెచ్చి పడేస్తుంది. ఆబస్సు దాటితే నేరుగా బస్సులేదు. రెండు బస్సులు మారాలి.

ఆకాశం ఉరిమింది. వజ్రాయుధంలా వో మెరుపు !

"న్యూ కాలనీ సెంటర్" అని పేరే కాని, కాలనీ ఆ సెంటరుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. మధ్యలో వో శిధిల గ్రామంతాలూకు శిధిలాలు— కొన్ని ఇళ్ళు.... వో పాడుబడ్డ ఆలయం. పగలే నిర్మానుష్యంగా ఉంటుంది. సాయంకాల మయితే అటు వెళ్ళటానికి జనం భయపడారు. మరిప్పుడు చీకటి పడింది. ఒంటరిగా.... దీనికితోడు వర్షంకూడా వస్తే ? .... అయ్యో....

సుమిత్రకు మళ్ళీ....మళ్ళీ బాబు గుర్తుకు రాసాగేడు.

బాబు....బాబు....వాడిని త్వరగా చేరుకోవాలి. పిచ్చి సన్యాసి.... వర్షంకూడా వస్తే....ఒంటరిగా....చీకట్లో.... ఆమె పరుగెడుతోం దిప్పుడు.

సుమిత్ర అందగత్తె. కాస్తో కూస్తో చదువుకొంది. మనోహరరావు ఆమెను ప్రేమించి కట్నం లేకుండా పెళ్ళి చేసుకొన్నాడు. అతడిని చేసుకొనేముందే ఆమె వో కండిషన్ పెట్టింది.

"మీరు నన్ను కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటున్నారు. మీ

సహృదయతకు జోహార్లు. కానీ పెళ్ళయ్యాక నన్ను కూడా ఉద్యోగం చేసి ఆర్జించమని కండిషన్ పెట్టరాదు."

"అలాగే. కానీ ఉద్యోగం చేయటంపట్ల మీ కంత విముఖత్వం ఎందుకో తెలుసుకోవచ్చా ?"

"విముఖత — ఉద్యోగం చేయటంపట్ల కాదు. గృహిణిగా నా ధర్మం నేను సక్రమంగా నెరవేర్చాలన్న కోరికతోనే. మీ సంపాదనతో మన సంసారం గడవదనుకొన్ననాడు, నేను కూడా అర్జించక తప్పని పరిస్థితి వచ్చిననాడు ఉద్యోగం చేయటానికి నాకు అభ్యంతరం లేదు."

"అది సరే. కానీ ఇద్దరం సంపాదిస్తే ఇంకా ఎక్కువ సుఖాలు అనుభవించవచ్చు కదా ? హెచ్చు మొత్తంలో ధనాన్ని కూడబెట్టుకోవచ్చు కదా ?"

"సరిగ్గా నేను ఈ ఆలోచనా విధానానికే విముఖురాలిని. ఎక్కువ సంపాదన....ఎక్కువ విలాసాలు.... ? ఆ పరుగు పందేనికి అంతెక్కడ ? రేడియో ఉంటే, టేప్ రికార్డర్ కావాలన్న కోరిక. అదీ ఉంటే టూ ఇన్ వన్.... టెలివిజన్, ఫ్రిజ్, వీడియో....కారు....పెద్ద బంగళా .... ఇంకా, ఇంకా ఏమేమో ! యంత్రసుఖాలే సుఖాలా ? ఇల్లు చక్కదిద్దుకోవటంలో, నా బిడ్డల్ని నేను పెంచుకోవటంలో ఉన్న సుఖానికి, తృప్తికి విలువలేదా? గృహిణిగా నా ధర్మం నెరవేర్చటంలో నాకు ఆనందం ఉంది. ఆ మానసిక ఆనందాన్ని నేను వదులుకోను."

మనోహరరావు ఆమెను అర్థం చేసుకొన్నాడు. అతని ఆర్జనతో లభ్యమయిన భౌతిక సుఖాలతోనే ఇద్దరూ తృప్తి పడ్డారు. దాంపత్య జీవితంలో సుఖాన్ని మూడేళ్ళు తనివితీరా అనుభవించారు. ఫలితంగా బాబు పుట్టేడు. వాడి ముద్దు ముచ్చటలలో మరో రెండేళ్ళు రెండు క్షణాల్లా గడిచిపోయాయి ఆ దంపతులకు.

సరిగ్గా అప్పుడు విధి వారిపై వక్రదృష్టిని ప్రసరించింది. మనోహరరావుకు స్కూటర్ ఏక్సిడెంట్ అయింది. మతిభ్రమణం .... ఉద్యోగానికి అనర్హుడు కావటం.... అతడిని ఉద్యోగంలోనుంచి తీసేస్తూ ఆమెకు ఏదన్నా ఉద్యోగం ఇస్తామనటం .... ఆ ఉద్యోగంలో ఆమె చేరటం .... ఒకదానివెంట ఒకటి చకచకా జరిగిపోయాయి.

మనోహరరావును మెంటల్ హాస్పిటల్‌లో చేర్చక తప్పలేదు. ఆమె ప్రతి ఆదివారం వెళ్ళి చూచి వస్తుంటుంది. కొన్నాళ్ళు అక్కడ ఉంటే మళ్ళీ మామూలు మనిషి అవుతాడని అంటున్నారు నిపుణులు. అదే ఆమె ఆశ.

ఉన్నదానితో తృప్తి పడాలన్న తత్త్వం సుమిత్రది. కానీ ఇవాళ ఉన్నది చాలనిస్థితి దాపురించిం దామెకు. అందుచేత ఆమె బాబుకు అయ్యే ఖర్చుల్ని మినహా మిగతా అన్నింటినీ తగ్గించేసింది. ఆ పొదుపు ఉద్యమంలో భాగంగానే సిటీని వదిలి వూరికి దూరంగా ఉన్న న్యూ కాలనీలోని అద్దె ఇంటిలోకి వచ్చి పడింది. ఆమె ఎవరి జాలిని, దయా ధర్మభిక్షల్ని ఆశించలేదు. స్వశక్తిపైన సంసార జీవన శకటాన్ని ఆగకుండా ముందుకు లాక్కుపోవాలని నిర్ణయించుకొంది.

సంసార జీవన శకటం కాడికి పూడ్చిన జోడు గుర్రాల్లాంటి వారు భార్యాభర్తలని ఆమెకు తెలుసు. బరువు సమానం. సమంగా మోయాలి. సమంగా లాగాలి. భర్త ఆర్థిక బరువును మోస్తే, భార్య నిర్వహణ బాధ్యత వహించాలి. భౌతిక సుఖాల్ని సమకూర్చే బాధ్యత భర్తదయితే, మానసిక సుఖాన్ని, ప్రశాంతతను సమకూర్చే బాధ్యత భార్యది. అప్పుడే గృహం స్వర్గమవుతుందని ఆమె విశ్వాసం. అందుకే పెళ్ళికి ముందే ఉద్యోగం చేయనని కండిషన్ పెట్టింది.

కాని విధి వైపరీత్యంవల్ల ఆ సమతూకం తప్పింది. ఒంటరిగానే సంసార శకటాన్ని తను లాగాలి. ఎవరికోసం ? తనకోసం కాదు. భవిష్యత్తు కోసం. ఆమె దృష్టిలో ఆ సంసార శకటపు భవిష్యత్ కిరణం సురేష్‌బాబు !

నెత్తిమీద బండరాయిలా చినుకు పడ్డట్టు అయింది. ఆమె ఆలోచన చెదిరింది. చూస్తే ఒకటి కాదు.... చాలా చినుకులు శరీరాన్ని తడుపు తున్నాయి.

వర్షం.... పెద్ద పెద్ద చినుకులు....

డిసెంబర్‌లో వర్షం ఏమిటి ?

ఏమిటంటే ఏమిటి ? విధి వైపరీత్యాలలాగే వాతావరణ వైపరీత్యం. నిన్నటి ధనవంతుడు ఇవాళ బీదవాడు, ఇవాళ్టి బీదవాడు రేపు కోటీశ్వరుడు కావటంలేదూ ? నిలకడలేని జీవితం—వాతావరణానికీ మనుష్యుల గాలి సోకిందేమో ! నవనాగరికతా ప్రభావం తగిలిందేమో !

పదడుగులు వేసేసరికి, ఆమె వర్షం ఉద్ధృతమయినట్లు గ్రహిం చింది. ఆమె ఆకాశంలోకిచూచింది. చీకటి—చుట్టూ చూచింది. చీకటి....

ఆ చీకట్లో పక్కనే పాడుబడ్డ ఆలయం. అక్కడెవరో జనం ఉన్నట్లున్నారు. వర్షానికి తలదాచుకుంటున్న కాలనీ జనమేమో !

సుమిత్రకు బాబు గుర్తొచ్చాడు. వర్షాన్ని లెక్కచేయకుండా ముందుకు పరుగెత్తాలని ఉందామె మనసుకు. కానీ అంతలో తనకు వర్షం పడదని, వర్షంలో తడిస్తే కనీసం పదిరోజులు పడక వెయ్యటం తథ్యమని గుర్తుకొచ్చింది. అమ్మో.... పది రోజులు పడకే .... ఆఫీసు....బాబు.... ఆయన.

ఆమె చటుక్కున పాడుబడ్డ దేవాలయంలోకి ప్రవేశించింది.

*　　　　*　　　　*

ఆలయంలో ప్రవేశించి చీకట్లో చూరుకింద నిలబడిందామె. అదృష్ట వశాత్తు ఆమె రాకను లోపల ఉన్నవారు గుర్తించలేదు. పేకాట ఆడుకుంటూ వాళ్ళ ధోరణిలో వాళ్ళు మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ మాటల్ని వింటూంటే ఆమెకు భయమేసింది. తాగుబోతులు....దొంగలు....తార్పుడు గాళ్ళు....జూదరులు. ఒక్కొక్క రంగంలో ఒక్కొక్కడు ప్రసిద్ధుడయినట్లు మాట్లాడుతున్నాడు.

స్త్రీల పట్ల జరుగుతున్న అనేక విధాలైన అత్యాచారాల కథలు ఆమెకు గుర్తుకొచ్చాయి. ఇళ్ళలో తమ మానాన తాము ఉంటేనే స్త్రీల ధన మాన ప్రాణాలకు రక్షణ లేని రోజులే. ఇక ఇక్కడ....ఇప్పుడు.

ఒక స్త్రీ, నలుగురు దుర్మార్గులు—కాముకులు....అల్లంతదూరంలో చీకట్లో ఉన్న ఆ నలుగురు ఆమె కళ్ళకు పెద్దపులుల్లా కనిపించారు.

ఎంత ధైర్యం ఉంటేనేం ? తను మేక వారిముందు.

పైగా ఒక స్త్రీ జీవితంలో సమస్యల్ని ఎదుర్కోటానికి కావాల్సిన ధైర్యం వేరు. పురుషుడు జరిపే అత్యాచారాన్ని ఎదుర్కోటానికి కావలసింది ధైర్యం ఒక్కటే కాదు. బలం. సమస్యల్ని ఎదుర్కొనే మనో ధైర్యం తనకు ఉంది. అంతమాత్రాన పులుల నోళ్ళలో తల పెట్టటం సాధ్యమా ?

అమ్మో ! తనకూడా ఏదైనా జరిగితే. బాబు....బాబు.

వర్షంలో తడిస్తే పది రోజులు జ్వరంతో పడక.... కానీ ఇక్కడ ఉంటే ? జీవితమంతా చీకటే.

వాళ్ళ కళ్ళలో పడకుండా మెల్లగా బయట పడాలి.

ఆమె పైటకొంగును తల నిండా కప్పుకుని చూరునుంచి బయటికి రావటానికి అడుగు ఎత్తింది.

సరిగ్గా ఆ సమయంలో ఆలయం ముందు ఎవరో సైకిల్ దిగారు.

ముందుకు వెయ్యబోయిన అడుగును వెనక్కి వేసిం దామె.

ఈ కొత్త వ్యక్తి ఎవరో ? కాలనీలో వ్యక్తి అయితే ఫరవాలేదు. తను ధైర్యంగా వెళ్ళవచ్చు.

"ఒరే, యాద్గిరీ....నర్సిమ్మలూ...." ఆ వ్యక్తి సైకిల్ దిగుతూనే గట్టిగా కేక వేశాడు.

"అడ్గో—బాస్ వచ్చిండు." నలుగురిలో ఒకడన్నాడు.

సుమిత్ర గుండె గుబేలు మంది. నలుగురితోనే చావు అనుకుం టుంటే అయిదోవాడు కూడా దాపురించాడే ! అందులోనూ వీడు "బాస్"ట. ఆ బాస్‌గాడు తన ముందునుంచే వెళ్ళాలి. పొరపాటున తనని చూస్తే ?

సుమిత్ర దేముడి మీద భారం వేసి పాడుబడ్డ గోడకు అతుక్కు పోయినట్లు నిలబడింది.

బాస్ ఆలయం మెట్లెక్కి సుమిత్ర నిలుచున్న చోటుదాకా వచ్చి ఆగాడు. అతని చూపు వేరుగా ఉంది.

"గీడ్నే ఉన్నారంట్రా ఎదవ నాయాళ్ళారా !"

"నల్గురం గీడనే ఉన్నాం బాస్. నీ కోసమే ఎదురు సూత్తన్నాం. ఇంతలో ఈ వర్సం తగుల్కొంది."

"ఎదవ్వోర్సం. అసలే సలికి పేనం గిజగిజలాడి పోతాఉంటే గీ వానొకటి ? సప్పగ తడిసి పోయాననుకో. ఏడి కావాల—అరజంటుగా !"

"గీడ లెడీగా ఉంది బాస్. నీ సీసా."

"గుడ్డురా. ఇయాళ మనం ఏడకి పోయినా ఇజయమే. ఒరేయ్, యాద్గిరీ, ఆ సైకిల్ లోపలపెట్టిరా." బాస్ ఆజ్ఞ జారీ చేస్తూ జేబులోనుంచి సిగరెట్టు, అగ్గిపెట్టె తీశాడు.

సుమిత్ర గుండె ఆగింది. అగ్గిపుల్ల గీస్తే ఆ వెలుగులో తను దొరికి పోతుంది వాడి కళ్ళకి ! వెధవ—అసలే వేడి కావాలంటున్నాడు. తనని చూస్తే వదుల్తాడా ?

అదృష్టం ! బాస్‌గాడు అగ్గిపుల్ల గియ్యకుండానే లోపలికి అడుగు పెట్టేడు. "అమ్మయ్య" అని సుమిత్ర అనుకుంటుండగా యాదగిరి బయటికి వచ్చాడు.

సరిగ్గా ఆ సమయంలో ఆకాశంలో ఒక మెరుపు మెరిసింది.

"గీడెవరు, బాస్ ? ఆడకూతురు !" యాదగిరి సుమిత్రను చూచి అరిచాడు. బాస్ వెనక్కి వచ్చి అగ్గిపుల్ల వెలిగించాడు.

సుమిత్ర వెన్నులో వణుకు ! శరీరంలో రక్తం ఒక్క క్షణంలో నీరుగా మారినట్లు ఒళ్ళంతా చల్లబడింది.

"గిదేంటి, బిడ్డా ! వొర్సంలో గీడ నిలబడ్డవేంది ? సలికి ఎట్టా వణుకుతున్నావో సూడు. లోపలికి రా, బిడ్డా."

ఎంత జాలి ? ఏం మర్యాద ? ఒట్టి నటన !

పులికి ఇలాంటి నటనలు తెలియవు. ప్రకృతి సిద్ధంగా లభించిన ధర్మాన్ని ఆచరిస్తుంది. కానీ నాగరికతను తిని బలిసిన మనిషి ! మానవత్వాన్ని నటించి గొంతు కోస్తాడు.

"దేవుడిని మనుసులు మర్చిపోయారమ్మా. ఈ గుడిని పాడు బెట్టేరు. దేవుడు మట్టిలో పొర్లాడుతున్నాడు. వర్షానికి తడుస్తున్నాడు. కానీ ఈ గుడి మాలాంటోల్లకూ్కడా తల దాసుకునేందుకు నీడ నిస్తాంది, బిడ్డా. గుళ్ళోకి రావటానికి పెద్ద బయిమెందుకు ?"

వర్షం....గాలి.... ఇంకా పెద్దవయ్యాయి.

సుమిత్రను ఆ గాలిలో—వర్షంలో వెళ్ళనివ్వలేదు బాస్.

తప్పనిసరి అయిన స్థితిలో, గత్యంతరం లేక తెగించి గుడి లోపలి భాగంలోకి అడుగు పెట్టింది సుమిత్ర.

*　　　*　　　*

నిముషాలు యుగాల్లాగా భారంగా నడుస్తున్నాయి సుమిత్రకు. ఆమె దృష్టి అంతా ఆ అయిదుగురు రౌడీలపైనే ఉంది.

వాళ్ళు పూర్వంలా విచ్చలవిడిగా మాట్లాడుకోవడం లేదు. రహస్యంగా గుసగుసలాడుకుంటున్నారు.

తనని గురించే అయి ఉంటుంది ఆ గుసగుసలు !

రిస్ట్ వాచీ తప్ప తనవద్ద విలువైన వస్తువులేం లేవని వాళ్ళు ఈ పాటికి గ్రహించే ఉంటారు. అందుచేత తనవల్ల ధనలాభం ఏమీ ఉండదు. కానీ అంతకన్నా విలువైన తన మానం ?

రౌడీ వెధవలు ! ఇంకా స్త చీకటి పడ్డాక ఎలా తన మానాన్ని దోచి వాటాలు పంచుకోవాలని గూడుపుఠానీ చేస్తున్నారా ?

వెధవ వర్షం....తనని పులుల గుహలోకి తోసింది.

బాబు....అయ్యో....ఎలా ఉన్నాడో ? ఏం చేస్తున్నాడో — పిచ్చి సన్యాసి !

పిక్కొంటివాళ్ళు మరీ అంత అమానుషంగా ఉంటారా? వాడి విష యంలో శ్రద్ధ వహించే ఉంటారు.

అయినా ఇదేమిటి? తను తప్ప న్యూ కాలనీ వెళ్ళే మనుష్యులే లేరా? ఎంత వర్షమయితేమాత్రం రాత్రి ఏడు గంటలు కాకముందే జన జీవితం స్తంభించిపోతుందా?

ఎవరన్నా వస్తే బాగుండును—తోడు. వెధవలు సౌంజ్ఞలతోనే ఏదో ప్రణాళికలు వేస్తున్నారు. తోడుఉంటే తనకి ధైర్యం. వాళ్ళ దవుష్ట్యానికి కాస్తంత చెక్.

ఆమె ఆశగా రోడ్డుపైకి దృష్టి సారించింది. సిటీ నుంచి వచ్చేవైపు నిర్మానుష్యం....చీకటి—గాలి ఆ వైపు నుంచి తీవ్రంగా వీస్తూంది.

కొనాశను చంపుకోలేక ఆమె ఇటునుంచి ఎవరైనా వస్తున్నారేమో నని చూసింది. ఆఁ....ఏదో వాహనం! కాలనీ వైపునుంచే వస్తోంది.

అమ్మయ్య! సుడిగుండంలో ఇరుక్కొన్న మనిషి చేతికి గడ్డిపరక దొరికినట్లు ఏదో సంతోషం .... ధైర్యం .... ఆశ ....

ఆమె అయిదుగురు రౌడీల వైపు చూచింది. వాళ్ళు ఆమెవైపే చూడటంలేదు. గుసగుసలు—కుట్ర....గూడుపుఠానీ....

ఆమె రోడ్డువైపు చూసింది. స్కూటర్ ఆ వాహనం....

ఆగుతుందో ఆగదో? పోనీ తనే పరుగెత్తుకొని వెళితే? గట్టిగా కేకలేస్తే?

ఆ పనులేమీ చెయ్యాల్సిన అవసరం లేకుండానే స్కూటర్ గుడి వద్ద కొచ్చి ఆగింది. అయిదుగురు రౌడీ వెధవలు గుసగుసలు ఆపి లేచి రోడ్డుపైకి చూచారు. అందులో ఇద్దరు దాక్కొన్నారు.

రెయిన్‌కోట్ వేసుకొన్న వో యువకుడు స్కూటర్ దిగి లోపలికి వచ్చాడు. బాస్ అగ్గిపుల్ల వెలిగించి సిగరెట్ ముట్టించుకున్నాడు.

"అమ్మయ్య! ఎవరో తోడున్నారుకదా? వెధవ గాలి. స్కూటర్‌ని వెనక్కి నెట్టివేస్తున్నదండీ." బాస్‌తో అంటూ అతను సుమిత్రను చూశాడు.

"నేను న్యూ కాలనీకి వెళ్ళాలి. వర్షం నుంచి తల దాచుకోవటానికి నేనూ మీలాగే ఇక్కడికొచ్చాను." ధైర్యం చేసి సుమిత్ర అతనికి తన ఉనికిని స్పష్టం చేసింది. అతను రెయిన్‌కోట్ విప్పాడు.

"అలాగా! నేను రెయిన్‌కోట్ ఉందికదా అని వర్షంలోనే బయలు దేరేనండీ. అర్జంటుగా సిటీకి వెళ్ళిపోవాలి. కాని ఈ గాలి చూడండి" అంటూ జేబులో నుంచి సిగరెట్టు, అగ్గిపెట్టె తీసి అగ్గిపుల్ల వెలిగించాడు.

అయితే అతను అగ్గిపుల్ల వెలుగులో తనని, ఆ పరిసరాలని స్టడీ చేసేడని ఆమె గుర్తించింది. అంతేకాదు. అతడిని ఆమె స్టడీచేసిందికూడా.

అతను విద్యావంతుడు, ధనవంతుడని తెలుస్తునేఉంది. తన భర్త వయసే ఉండవచ్చు. పుష్టిగా—ఆరోగ్యంగా ఉన్నాడు. కనుక ఫర్వాలేదు.

"మీరు మనోహరరావు మిసెస్ కదూ? మీరు ఈ కాలనీలో చేరేరా? పాపం! మనోహరరావు మెంటల్ హాస్పిటల్‌లో ఉంటున్నాడుట కదా?" అతను మనోహరరావుని బాగా తెలిసినట్లు అలా మాట్లాడుతుంటే ఆమెకు భయం పోయింది. ఆత్మీయుడి అండ లభించినట్లు ఆనందించింది.

"కాలనీ డెవలప్ అయింది కానీ ఈ కాస్తమార్గం మాత్రం ఇప్పు డప్పుడే డెవలప్ కాదండీ. రోడ్‌కి, కాలనీకి మధ్యఉన్న స్థలం అంతా లిటి గేషన్‌లో పడిపోయింది. ఇలాంటి సమయాల్లో ఈ వైపు రావాలంటే మాలాంటి వాళ్ళకే భయం. మరి ఆడవాళ్ళ సంగతి చెప్పేదేముంది? కానీ

మీకేం భయం అక్కర్లేదండీ. వర్షం తగ్గాక స్కూటర్‌మీద మీ ఇంటివద్ద మిమ్మల్ని దించి వెళ్తానుగదా?"

సుమిత్ర ధైర్యంగా రౌడీల వైపు చూచింది. అయిదుగురు మళ్ళీ ఒకేచోట చేరారు. రహస్యంగా ఏదో ప్రణాళిక ఇంకా వేస్తూనే ఉన్నారు.

* * *

"వర్షం తగ్గిందండీ. బాబేం చేస్తున్నాడో? ఇక బయల్దేరుతానండీ" అని సుమిత్ర అతనితో అనబోతుండగా బాస్ హఠాత్తుగా ఆమె వద్ద కొచ్చాడు.

"బిడ్డా! మేం జల్దీ వెళ్ళాలె. వర్సంకూడా తగ్గింది. పరిషానేం కాకుండా నువ్వు గింటి కెళ్తవు కదా?"

ఆమె తలూపుతూ అతని వంక చూచింది.

"ఆమె కేం ఫరవాలేదులే. నేను స్కూటర్ మీద డ్రాప్ చేస్తాను కదా!"

వాళ్ళు వెళ్ళిపోయారు.

చిత్రం! వాళ్ళు వెళ్ళగానే "పీడ వదలి"నట్లు సంతోషించలే దామె. మళ్ళీ ఏదో భయం ప్రవేశించిం దామెలో మెల్లగా.

తను—అతను! ఒంటరిగా—రాత్రి సమయంలో!

గాలి తగ్గింది. సన్న సన్న తుంపర్లుగా వర్షం పడుతున్నట్లుంది!

అతనికి తన భర్త తెలిసే ఉండవచ్చు. విద్యావంతుడు, ధనవంతుడు, పెద్దమనిషి కావచ్చు. కానీ పురుషుడేగా? కామాతురుడు అయిన పురుషు డెవరైనా మృగంతో సమానమే!

"ఇంక వెళదామండీ." ఆమె చొరవ చేసి గబగబా నాలుగు అడుగులు బయటికి వేసింది.

"ఒక్క నిమిషం" అంటూ అత నామె చేయి పట్టుకున్నాడు.

సందేహం లేదు. ఆ స్పర్శలో వేడి. వీడెవడో కామాతురుడే. నాగరిక మృగం. ఆమె చివ్వున వెనక్కి తిరిగి చిరుతపులిలా చూచింది.

"ఓ ! సారీ." అతను నొచ్చుకుంటున్నట్లు ఆమె చేయి వదిలాడు.

ఇందాక రవుడీల బాస్ మాటలు నటననుకున్నది తను. కానీ అసలు నటన ఇది !

"చలిగా ఉంది కదూ ? ఈ రైన్‌కోట్ వేసుకున్నదాకా కాస్త ఆగుతారా ?" అంటూ అతను రైన్‌కోట్ వేసుకోవడం మొదలు పెట్టాడు.

ఆమె మాట్లాడకుండా అటూ ఇటూ చూచింది. అక్కడ రాళ్ళు పుష్కలంగానే ఉన్నాయి. అవసరమయితే ఆత్మరక్షణార్థం వో రాయిని ఖర్చు చేసుకోవచ్చు. దుష్టశిక్షణార్థం దేముడు....

"ఈ చలిని రైన్‌కోటు ఆపలేదు సుమిత్రా. పురుష స్పర్శకు దూరమైన స్త్రీవి. నీ చలికూడా ఆలోచించాలిగా నేను ! కాస్త మన శరీరాలను వేడి చేసుకుందాం. ఏం ? ఇక్కడికి ఎవరూ రారు. చూస్తారన్న భయం లేదు. పైగా ఎంత పాడుబడ్డ దేవాలయం ! ఇక్కడ మన మనసులు, శరీరాలు ఏకమయితే జీవితాంతం నీకు నేను, నాకు నువ్వు అండ. ఏమంటావ్ ?"

ఏం అనటానికి అతను అవకాశం ఇస్తేనా ? అతని చేతులు ఆమెను చక్రబంధంలో ఇరికించి వేశాయి.

పులి పంజాలో ఇరుక్కున్న మేకపిల్లలా గింజుకొంటున్న దామె.

ఆమెకు రవుడీలు గుర్తుకొచ్చారు. వారిని చూచి అనవసరంగా భయ పడింది. వారి నుంచి తనను రక్షిస్తాడనుకున్నవాడే ఇప్పుడు భక్షకుడుగా మారాడు. భగవంతుడా ! నువ్వే దిక్కు.

"సుమిత్రా ! యు ఆర్ లౌలీ." అతని మొహం ఆమె మొహానికి దగ్గరగా వస్తూంది. ఆ కళ్ళు....కామంతో కాలుతున్న కళ్ళు....

దగ్గరికి. దగ్గరికి. మరింత దగ్గరికి. మండుతూ వస్తున్నాయి.

అగ్ని పవిత్రమైనది. కానీ ఈ అగ్ని విషాగ్ని. ఈ మంటలో అంతా అపవిత్రతే !

ఆ మంటను చూడలేనట్లు ఆమె కళ్ళు మూసుకుంది. ఒక ఆర్త నాదం చేసింది. విషాగ్నికి ఆహుతి అవుతున్నట్లు, కామపు మంట కాల్చి వేస్తున్నట్లు.

సరిగ్గా అప్పుడు....

ఉరుము మెరుపు ఏదో చల్లటి దివ్యకాంతి.

ఒక పెద్దశబ్దం చక్రబంధం నుంచి తన శరీరం విముక్తి చెందిన అనుభూతి.

చేతుల్ని కాళ్ళని కదిలించి చూచుకుంది. సందేహం లేదు. ఆ ధూర్తుడి దుష్టబంధనలో లేదు తను. ఆమె మెల్లగా కళ్ళు తెరిచింది.

ఎదురుగా బాస్ ! అతనికి ఎదురుగా వణుకుతున్న నరమృగం ! వాడి కళ్ళలో మంట చల్లారినట్లుంది. కానీ సన్నటి తడిమంట ! విషజ్వాల!

"నీకు బయమేం లేదు బిడ్డా. దేవమందిరంలో ఉన్నావు నువ్వు."

అవును. తను దేముడి చెంతనే ఉన్నది.

"మమ్మల్ని ఈడ చూచి నువ్వు లోపలికి రావటానికే బయపడ్డావు కదా బిడ్డా. కానీ ఎంత దొంగలం, హంతకుల మయినా మాకు దరమం తెల్సునమ్మా. మేం మా వృత్తికి దాసులం. డబ్బుకు బానిసలం. అంతే కానీ కామానికి కాదు బిడ్డా. అగ్గిపుల్ల ఎలుగులో ఈడు నిన్ను సూసినప్పుదే ఈడి కళ్ళలో నాకు కామం కనిపించింది. పరాయి ఆడదాన్ని కామించిన వోడు సిగ్గు లజ్జల్ని, భయాన్ని, మాన మర్యాదల్ని, మంచితనాన్ని మర్సి పోతాడని నాకు తెలుసు. నే ననుకున్నట్టే జరిగింది. ఈడి సంగతి ఇంక మేం సూసుకుంటాం కానీ నువ్వు గింటికి తొరగా ఎల్లు బిడ్డా. నీ బాబు ఏడస్తా ఉంటాడో ఏమో ? మా నర్సిమ్ములుగోడు నిన్ను కనిపెట్టి ఉండి ఇంటి దాకా వత్తాడే."

సుమిత్ర దేవాలయం దాటి బయటికి వచ్చింది.

వర్షం తగ్గింది. ఆకాశంలో నక్షత్రాలు మిలమిల మెరుస్తున్నాయి.

ఆమె రోడ్డు ఎక్కబోతూ వెనక్కి తిరిగి పాడుబడ్డ దేవాలయం వైపు చూచింది. బాస్ చెయ్యి వూపుతున్నాడు. కానీ ఆమె కళ్ళకు ఆశీర్వదిస్తున్న దేముడు కనిపించాడు. దేవాలయంలో ఏదో దివ్యతేజం !

చేతులెత్తి నమస్కరించిందామె.

పాడుబడ్డ దేవాలయం దేవాలయమే !

ఎంత చెడ్డా మానవత్వం మిగిలి ఉన్న వాడు మనిషే !

మానవుల్లో మృగా లుండటంలో ఆశ్చర్యం ఏముంది ? మృగాలలో ...డా మానవత్వం ఉండటమే నాగరికతకు శ్రీరామరక్ష !

(శ్రీమతి మాదిరెడ్డి సులోచన ప్రథమ వర్ధంతి సందర్భంగా అభ్యుదయ వేదిక, హైదరాబాద్ వారు నిర్వహించిన కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన.) ఆంధ్రప్రభ వార పత్రిక 21-3-84